# చరిత్ర, మనిషి, మార్క్సిజం

కథా సాహిత్యానికి వస్తువెప్పుడూ 'మనిషే.' ఒక యుద్ధాన్ని గురించి ఒక విద్యాలయాన్ని గురించి ఒక ఆస్పత్రి గురించి రాసిన కథలూ నవలలూ లేకపోలేదు. కానీ వాటంతటవి సాహిత్యం కాజాలవు. యుద్ధంలో మనుషుల గురించి, విద్యాలయంలో మనుషుల గురించి, ఆస్పత్రిలో మనుషుల గురించి, సమర్థవంతంగా రాసింది సాహిత్యం కాగలదు. ఆ నేపథ్యం ఏదో ఒక నేపథ్యం కాక సామాజిక పరిణామంలో కీలక స్థానంలో ఉన్న చారిత్రక సందర్భం అయినప్పుడు అది నిలిచి పోయే సాహిత్యం కాగలదు.

ఆ నేపథ్యంలో అభ్యుదయం వైపు నిలబడేదే గొప్ప సాహిత్యంగా నిలిచి పోతుందని చెప్పగలిగితే బాగుండును. కానీ అది నిజం కాదు. లోతయిన ఏ చారిత్రక పరిణామమయినా అనేక ఆశలనూ ఆకాంక్షలనూ భయాలనూ మేల్కొలుపుతుంది. అప్పటివరకు పట్టించుకోని జీవిత విశేషాల పట్ల కుతూహలాన్ని మేల్కొలుపుతుంది. జీవితంపైన ఒక బలమైన సర్చిలైట్ వేస్తుంది. ఆ మేల్కొలుపులో ఆశకంటె భయమే ప్రధానమయినా - రెండిటికంటె నిర్లిప్తమయిన కుతూహలమే ప్రధానమయినా - అది చీకటి కోణాలలో దాగి వున్న మానవ జీవిత విశేషాలపైన 'ఫ్లడ్లైట్' ఉదయించే ప్రభాత ప్రసారమే నిస్తేజమయిన బతుకు చీకట్లలో చూడటానికి ఏమీ లేదనుకున్న కళ్ళకు అనేక కొత్త విషయాలను - అవి నిజానికి పాతవే కావచ్చు - అది దివ్వెతో వెలిగించినట్టు చూపిస్తుంది. ఆ కొత్త వెలుగులో కనిపించే కొత్త భయాలు, కొత్త ఆశలు, కొత్త విషయాలు, కొత్తగా కనుగొన్న పాత విషయాలు, గొప్ప సాహిత్యం కథావస్తువు

'రవి అస్తమించని సామ్రాజ్యం'లో రవితేజం వెలిగించిన ప్రతీ అణువునూ తన స్వంత ఆస్తిగా పారవశ్యంతో వర్ణించిన కిప్లింగ్‌ను వలసవాసుల మయిన మనం ఒక వలసవాదిగా గుర్తించగలం. కొందరు ఆయనను శ్వేతజాతి దురహంకారి అనికూడ అన్నారు. కానీ ఆయన పారవశ్యంతో వెలిగించిన జీవిత విశేషాలను గొప్ప సాహిత్యం కాదనలేము. అటువంటి పారవశ్యానికి మనదయిన భౌతిక పునాది లోపించిన మనం వాటిని చూడలేకపోయామనీ చూసినా పరవశించలేకపోయామనీ గుర్తించకుండ ఉండలేము.

పాశ్చాత్య దేశాల ప్రజాతంత్ర విప్లవం చరిత్రలోకి తీసుకొచ్చిన శాస్త్రీయ దృష్టికీ ప్రజాస్వామ్య రాజకీయాలకూ భయపడిన కులాలు గాభరాగా మేల్కొని జీవితంలోని సకల కోణాలనూ తమ భయానికి అలంబనగా పరికించి చూసి గొప్ప సాహిత్యాన్ని సృష్టించాయి. మార్క్స్ మెచ్చుకొన్న బాల్జాక్ నుండి, మానవ స్వభావంలో అభ్యుదయ కాముకులు గుర్తించడానికి భయపడే అగాధాలను అసాధారణ ప్రతిభతో-ప్రగతివాదుల పట్ల కచ్చతో - వెలికి తీసి వర్ణించిన డాస్టయవ్‌స్కీ దాకా ఈ కోవకు చెందిన అగ్రగామి రచయితలు పాశ్చాత్య సాహిత్యంలో చాలా మంది వున్నారు. సోమర్సెట్ మామ్‌కు స్త్రీల పట్ల చులకన భావం ఉందని తెలిసినప్పటికీ అతని రచనలను చదివి ఆనందించడానికి అదెందుకో ఆటంకం కాలేదని స్త్రీవాద అభిమాని అయిన రచయిత్రి ఒకరు ఈ మధ్య అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజకీయ ఆర్థిక ప్రగతి పెరిగే కొద్దీ మనుషులలో పెరుగుతున్న యాంత్రికతనూ ఒంటరితనాన్నీ మామ్ తన రచనలలో వర్ణించడమే కాదు, ఆయన రచనా శైలి ఆ లక్షణాలను ప్రత్యక్షంగా ప్రతిఫలిస్తుంది.

చరిత్ర స్రవంతిలో మనిషి, మనిషి వ్యక్తిత్వంలో చరిత్ర, చరిత్రకు వ్యతిరేకంగా మనిషి, చరిత్రను నడుపుతున్న మనిషి, తన స్వంత ప్రయాణంలో చరిత్ర నొక మజిలీ చేసుకున్న మనిషి, నిత్యం రగిలే తన కొలిమికి మనిషిని ఒక సమిధ చేసుకున్న చరిత్ర - ఇది కథా సాహిత్యానికీ నవలా సాహిత్యానికీ వస్తువు. దీనిని నిజాయితీగా స్వీకరిస్తే తప్ప గొప్ప సాహిత్యం సాధ్యం కాదు. నిజాయితీగా స్వీకరించాలంటే చారిత్రక వాస్తవాలను వాస్తవాలుగా చూసే ధైర్యం అవసరం. ఆ వాస్తవాలలో మన మానసిక భద్రతనూ భౌతిక సుఖాన్నీ భంగపరిచేవి తప్పక ఉంటాయి కాబట్టి ఆ ధైర్యం మనిషికి సులభంగా అబ్బదు. అయితే దానితోబాటు మనిషిలోని చీకటి కోణాలనూ, మనిషికీ చరిత్రకూ మధ్య నున్న సంబంధంలోని ఎగుడు దిగుళ్ళనూ నిర్భయంగా స్వీకరించే ధైర్యమూ అవసరం. వీటిని స్వీకరిస్తే అభ్యుదయ రాజకీయ సంస్కృతిలోని అచారిత్రకమైన ఆశావాదం దెబ్బతింటుంది కాబట్టి ఈ ధైర్యం అబ్బడమూ కష్టమే. కొందరిలో అది లేక కొందరిలో ఇది లేక తెలుగులో గొప్పదని చెప్పగల కాల్పనిక సాహిత్యం- ముఖ్యంగా నవలా సాహిత్యం - స్వల్పంగానే ఉండిపోయింది. ఇందులో మొదటి అవసరాన్నే తప్ప రెండవ అవసరాన్ని మార్క్సిస్టు సాహిత్య విమర్శ గుర్తించినట్టు కనిపించదు.

ఇదీ కేవలం సాహిత్య సృజనకూ సాహిత్య విమర్శకూ సంబంధించిన లోపం అని భావించగల రోజులు బహుశా గడిచిపోయాయేమో. సోషలిజం, సమసమాజం అనే ఆదర్శాలే ఈ రోజు సంక్షోభంలో ఉన్నాయి. సోవియట్ రిష్యా, చైనా తదితర దేశాలలో వచ్చిన రాజకీయ మార్పులకు పాక్షికమైన జవాబులు చెప్పి ఊరుకోకుండ సంక్షోభాన్ని సంక్షోభంగా స్వీకరించి చర్చిస్తే మార్క్సిస్టు అవగాహనలో ఉన్న కొన్ని ఖాళీలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. వీటిలో ప్రధానమయినది మానవ ప్రవృత్తికీ సమ సమాజ ఆదర్శానికీ మధ్య నున్న జవాబు దొరకని ప్రశ్నలు. మనిషిని చరిత్ర నిర్మాతగా మార్క్సిజం గుర్తించిందిగానీ ఆ చరిత్రకూ దాని నిర్మాతకూ మధ్య నున్న సంబంధాన్ని వివరంగా ప్రతిపాదించలేదు. దానిలోని ఎగుడు దిగుళ్ళను గుర్తించ లేదు. ఆ సంబంధం "గతి తార్కికం" అని ముందు జాగ్రత్తగా ప్రకటించి ఊరుకుంది. మనిషికీ బయటి ప్రపంచానికీ మధ్యనున్న ఏ సంబంధమయితే ప్రపంచ వ్యాప్తంగా గొప్ప కాల్పనిక సాహిత్యం వస్తువుకు మూలంగా ఉంటూ ఉందో ఆ సంబంధానికి చారిత్రక భౌతికవాద సిద్ధాంతంలో స్పష్టమయిన చోటులేదు. క్రిస్టఫర్ కాడ్వెల్ రాసిన కాల్పనిక సాహిత్య విమర్శలో ఈ లోపం ప్రభావం స్పష్టంగా కని పిస్తుంది. ఆయన మేధో సంపత్తి గురించి, కమ్యూనిస్టు ఆదర్శం పట్ల ఆయనకున్న నిబద్ధత గురించి, ఆచరణాత్మకమైన త్యాగశీలాన్ని గురించి, అనుమానానికి ఆస్కారం లేదు. ఇన్ని ఉన్నా ఆయన సాహిత్య విమర్శ కొంత దూరం ముందుకు సాగి అగాధం అడ్డం వచ్చినట్టు ఆగిపోతుంది. అవతలికి అందుకోలేదు.

శాశ్వతమయిన 'మానవ ప్రవృత్తి' అంటూ ఏదీ లేదని మార్క్సిస్టులు తరచుగా అంటూంటారు. ఈనాటి మార్క్సిస్టులే కాదు, మార్క్స్ స్వయంగా అన్నాడు. చాలా విషయాలలో భిన్నంగా కాకున్నా స్వంతగా ఆలోచించిన ఆంటో నియో గ్రామ్‌సీ కూడ అన్నాడు. చారిత్రక క్రమంలో మానవ ప్రవృత్తిలో మార్పులు లేకుండా పోలేదుగానీ అంతమాత్రం చేత 'మానవ ప్రవృత్తి' అనేది ఆలోచించకుండా కొట్టి పారేయగల విషయం కాదు. భావావాద ఆలోచన నుండి పుట్టిన భ్రమకాదు. శాశ్వతమయిన మానవ ప్రవృత్తి అనేదేదీ లేకపోయినా మానవ ప్రవృత్తిలో అన్ని సమాజాలలో అన్ని కాలాలలో బలంగా ఉండే కొన్ని లక్షణాలున్నాయి. అదట్లా ఉంచి మారుతున్న ఈ మానవ ప్రవృత్తికీ బయటి ప్రపంచంలో వచ్చే మార్పులకూ మధ్యనున్న సంబంధం సరళమయింది కాదు. సామాజిక వ్యవస్థలో

మౌలికమైన మార్పు వచ్చినప్పుడు దానికి తగినట్టు మానవ ప్రవృత్తి కూడ మారిపోతుందని భావించి ఆ ప్రవృత్తి గురించి ఆలోచించనవసరం లేదని చారిత్రక భౌతికవాద సిద్ధాంతం ఇప్పటిదాకా చెప్తూ ఉంది. మార్క్సిస్టులందరికీ కాకున్నా కనీసం మార్క్సిస్టు సాహిత్యకారులకు ఇది నిజం కాదని తెలియదంటే నమ్మడం కష్టం. ఈ తాత్విక దృష్టి లోపం కారణంగా మార్క్సిజం చాలా నష్టపోయింది. ఉదాహరణకు మార్క్సిస్టులు సిగ్మండ్ ఫ్రాయిడ్‌ను అర్థం చేసుకోక మానవ అవసరాలలో సెక్స్‌కు అనవసరమైన ప్రాముఖ్యం ఇచ్చిన వ్యక్తిగా హేళన చేయడం నేర్చుకున్నారు. ప్రత్యక్ష పరిచయం అవసరం లేకుండ వినికిడి పాండిత్యంమీద కాలక్షేపం చేసే తెలుగు జాతి మేధావి వర్గం ఫ్రాయిడ్‌కు చాలా అన్యాయం చేసింది. వాళ్లలోని మార్క్సిస్టులు తమ అవగాహనకు చాలా మేలు చేయగల ఫ్రాయిడ్ ఆలోచనలను తృణీకరించి తాము చాలా నష్టపోయారు. మానవ ప్రవృత్తికి బయటి ప్రపంచానికి

సందర్భం: రాగో-నవల-సాధన. సృజన ప్రచురణ వెల : 10 రు. ప్రతులకు : నవోదయ బుక్‌షాప్, ఆర్య సమాజ్ మందిర్ ఎదురుగా-కాచీగూడా, హైదరాబాదు.

మధ్యనున్న ఘర్షణకు ఫ్రాయిడ్ మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాలలో కేంద్ర స్థానం ఉంది. మనిషి వ్యక్తిత్వ వికాసానికి వైఫల్యానికి ఈ ఘర్షణే మూలం అని ఆయన నమ్మాడు. మానవ ప్రవృత్తిలోని మౌలిక అంశాలుగా ఆయన గుర్తించినవి తప్పు కావచ్చు. 'బయటి ప్రపంచం' అనే దానిని ఒక సామాజిక వ్యవస్థగా అర్థం చేసుకోలేకపోవడం ఆయనలోని లోపం కావచ్చు. కానీ ఆ రెండింటికీ మధ్యనున్న ఘర్షణకు ఆయన తన విశ్లేషణలో ఇచ్చిన కేంద్ర స్థానం చారిత్రక భౌతిక వాద దృక్పథానికి చాలా సన్నిహితమయినది.

'మనిషి'కీ చరిత్రకూ మధ్యనున్న, సంకీర్ణమయిన సంబంధాన్ని వెలికి తీయడం, సూత్రీకరించడం ఈనాడు అవసరం. ఆ సంబంధం 'గతితార్కికం' అని వివరణ లేకుండ ప్రకటించి ఊరుకుంటే సరిపోయే రోజులు గడచిపోయాయి. ఈ అవసరాన్ని తీర్చడంలో నుంచి సాహిత్యం - ముఖ్యంగా నవలా సాహిత్యం - గణనీయమయిన పాత్ర నిర్వహించగలదు.

"రాగో" నవలలోని తుపాకులనూ మందు పాతరలనూ పక్కన పెడితే, ఆదివాసీ స్త్రీల జీవన స్థితిగతుల గురించి చెప్పిన ఆసక్తికరమయిన విషయాలు ప్రధానంగా

దృష్టిని ఆకర్షిస్తాయి. ఈనాటికీ 'ఆదిమ కమ్యూనిస్టు సమాజాన్ని' ఒక ఆదర్శవంత మయిన సమ సమాజంగా వర్ణించేవారు, ఆదివాసీల జీవితాన్ని దానికి నమూనాగా భావించేవారు, మార్క్సిస్టులలో చాలామందే ఉన్నారు కాబట్టి వాళ్ళంతా ఈ నవలను చదివితే మంచిది. అన్ని అనర్థాలూ స్వంత ఆస్తితోనే పుట్టాయని చాలా మంది మార్క్సిస్టులు నమ్మే సూత్రీకరణను స్త్రీ వాదులు కొంత కాలంగా సవాలు చేస్తున్నారు. స్త్రీ పైన పురుషుడి పెత్తనం — స్త్రీ లైంగికత్వం పైన సమాజం పెత్తనం — స్వంత ఆస్తికంటే ముందే పుట్టిందనీ దానికి మార్క్సిజం చెప్పగల జవాబేమీ లేదనీ స్త్రీ వాదులు సోదాహరణంగా సవాలు చేస్తున్నారు. నిజానికి అన్ని అనర్థాలూ స్వంత ఆస్తితో పుట్టాయనేది చారిత్రక భౌతిక వాదంలోని సూత్రం కాదు. కాలక్రమంలో దానిలోకి వచ్చి చేరిన అనేక వింత సంగతులలో అదొకటి. (స్వప్రయోజనం లేకుండ మనుషులు ఏ పనీ చేయరనీ, పాలక వర్గాలకు చెందిన వాళ్ళంతా చెడ్డ వాళ్ళనీ చాలామంది మార్క్సిజం పేరు మీద నమ్ముతుంటారు). సమాజంలో ఏ ఆచారం ఎప్పుడు పుట్టినా, దానిలో గణనీయమైన మార్పు రావడం అంటూ జరిగితే అది ఉత్పత్తి వ్యవస్థలోని మార్పును ఆశ్రయించి వచ్చిందే తప్ప విడిగా రాలేదనేది మట్టుకు చారిత్రక భౌతికవాద సూత్రమే. చారిత్రక భౌతిక వాదం సామాజిక జీవితం లోని మార్పుకు, పరిణామానికి, చరిత్రకు సంబంధించిన సిద్ధాంతం. దీనిని అభావం చేయగల ఉదాహరణలు చరిత్రలో ఉంటే అది మార్క్సిజానికి నిజమైన సవాలు అవుతుంది. అయినా మార్క్సిజంకాని మార్క్సిజాన్ని నమ్మేవాళ్ళు చాలామందే మనలో ఉన్నారు. కాబట్టి ఆదివాసీ స్త్రీల శరీరాలపైన, లైంగికత్వంపైన, మగవాళ్ళకూ ఆదివాసీ సమాజానికీ ఉండే కఠోరమైన పెత్తనాన్ని కదిలించేటట్టు వర్ణించే ఈ నవల ఆ కారణంగా ఆహ్వానించదగ్గది.

కానీ మార్క్సిజం ప్రస్తుతం ఎదుర్కొంటూ ఉన్న సంక్షోభాన్ని గురించి కలత చెందే వారికి నవల అంతా చదివిన తరువాత ఒక ప్రశ్న మిగిలిపోతుంది. స్త్రీ వ్యక్తిత్వంపైన ఆదివాసీ సమాజానికి ఉన్న పెత్తనం పట్ల నిరసనతో ఉద్యమం లోని వచ్చి చేరిన రాగో చివరికి ఏమవుతుంది ? ఇప్పటికి అనేక ప్రజా ఉద్యమాల లోకి వచ్చి చేరిన రాగోలంతా ఎక్కడున్నారు ? రాగో ఉద్యమంలోకి రావడానికి ఆ ఉద్యమం అంతిమ లక్ష్యాలకూ మధ్య ఏ మాత్రం సంబంధం ఉంది ? ఈనాటి రాగో రేపటి రాగో కాదు. రేపటి రాగో మర్నాటి రాగో కాదు. చివరికి ఏ రాగో

అంతిమ సామాజిక పరిణామానికి నాయకురాలవుతుంది ? లేకపోతే అంతిమ సామాజిక పరిణామం అంటూ ఏదీ లేదా ? ఒకరి తరువాత ఒకరు రాగోలు పుట్టి ఎదిగి నశించడం, ఆ క్రమంలో సమాజం మార్పు చెందుతూ అనంతంగా ముందుకు పోవడం-ఇదే చరిత్రా ?

సోవియట్ రష్యా తదితర దేశాలలో కమ్యూనిస్టు పార్టీ అధికారానికి వచ్చిన తరువాత సోషలిస్టు వ్యవస్థ చెక్కు చెదరకుండ ఉండడానికి ఒక వ్యూహం వేశారు. కార్మిక వర్గ ప్రాపంచిక దృక్పథం ఉన్న కమ్యూనిస్టు పార్టీ తప్ప వేరే పార్టీ ఏదీ దేశంలో లేకుండ చేసారు. ఆ పార్టీలోను, దేశ అధికార యంత్రాంగంలోను, విద్యా వైజ్ఞానిక రంగాలలోనూ పైకి వచ్చి ఉన్నతస్థాయిని అలంకరించే అవకాశం కార్మిక రైతాంగ కుటుంబాలలో పుట్టిన వారికే ప్రధానంగా కల్పించారు. పాత బూర్జువా భూస్వామ్య కుటుంబాలలో పుట్టిన వారికి ఆ అవకాశం కష్టతరం చేసారు. పాలక పార్టీ కార్మిక వర్గ పార్టీ అయివుండి, పార్టీ యంత్రాంగం, మేధావి వర్గం, అధికార యంత్రాంగం, కార్మిక రైతాంగ వర్గాలలో పుట్టిన వారితో నిండి ఉంటే, ఇంక సోషలిజానికి ఢోకా లేదనుకున్నారు. కానీ ఏం జరిగింది ? పార్టీలోనూ అధికార యంత్రాంగంలోనూ విద్యా వైజ్ఞానిక రంగాలలోనూ పైకి ఎగబ్రాకిన కార్మిక రైతాంగ వర్గాల బిడ్డలు నియంతలయి దేశాన్ని కర్కశంగా పరిపాలించారు. చివరికి వాళ్ళు, వాళ్ళ బిడ్డలు, సోషలిజం కంటె పెట్టుబడిదారీ విధానమే బాగుందని తిరోగమించారు. రివిజనిజమని పేరు పెట్టినా సరళీకరణ అని మర్యాదగా పిలిచినా సోవియట్ రష్యా చైనాలలో ఆ మార్పుకు పాల్పడింది పాత బూర్జువా భూస్వామ్య వర్గాల సంతతి కాదు. కార్మిక రైతాంగ వర్గం సంతతే. ఎటొచ్చీ తిరోగమనానికి పాల్పడే నాటికి వాళ్ళు కార్మిక రైతాంగ వర్గంలో లేరు. విప్లవం పేరు మీద పైకి ఎగబ్రాకి దేశ పాలకులయ్యారు.

మరి రాగో సంగతి ?

ఈ ప్రశ్న రాగో అనే వ్యక్తి గురించి కాదు. ఒక వ్యక్తి గురించి సూత్రీకరణ చేయడం అసాధ్యం, అనవసరం. జీవితాంతం కమ్యూనిస్టు ఆశయానికి కట్టుబడిన వ్యక్తులు అనేకులున్నారు. ఇంకా ఉండబోతారు. కానీ ఈ ప్రశ్న ప్రజా సమూహాల గురించి, సామాజిక వర్గాల గురించి, 'మనిషి' గురించి ఒక ప్రజా సమూహం (సౌలభ్యం కోసం వర్గం అందాము) ఒక ఉద్యమంలోకి ఎందుకు

వస్తుంది ? ఏం కోరి వస్తుంది ? తమలో అజ్ఞాతంగా ఉన్న ఆకాంక్షలను ఏ ఉద్యమం మేల్కొలిపితే ఆ ఉద్యమంలోకి పీడిత వర్గాలు పోతుంటాయి. ఆ ఉద్యమం లక్ష్యాలకూ తమ కోర్కెలకూ ఏ మాత్రం సంబంధం ఉందో ఆ వర్గాలు ఆలోచించినట్టు కనిపించదు. నిజానికి తేడా ఉందని తొలిదశలో గమనించినట్టు కూడ కనిపించదు. స్త్రీలుగా తమ వ్యక్తిత్వాన్ని కించపరిచే గణ ఆచారాల పట్ల నిరసనతో రాగో వంటి ఆదివాసీ స్త్రీలు తమకు అందుబాట్లో ఉన్న ఏకైక తిరుగుబాటులో భాగమవుతారు. అంతకు మించి ఆ తిరుగుబాటు అంతిమ లక్ష్యాలతో వాళ్ళకు నిమిత్తం ఉందని అనాలోచితంగా అనుకోవడం భ్రమ కాదా ? కానీ మనుషులలో పీడన పట్ల పరిమితమైన నిరసన కూడ అపరిమితమైన ఆదర్శాలకు 'జనరలైజ్' అయినట్టు అనిపిస్తుంది. మానవ ప్రవృత్తిలోని సార్వజనీన లక్షణాలలో ఇదొకటి. ఇది ఆ భ్రమను రెండువైపులా కొన్నాళ్ళు సజీవంగా ఉంచుతుంది. తాము సమస్యగా గుర్తించి ఆందోళన చెందుతున్న విషయం పరిమితమైనదనీ, తాము భాగస్వాములయిన ఉద్యమం లక్ష్యాలు అపరిమితమైనవనీ ఆ స్త్రీలు వెంటనే గుర్తించరు. ఉద్యమం పురోగమన క్రమంలో ఆదివాసీ జీవితంలో కొంత మార్పు వచ్చి వికారమయిన కట్టుబాట్లు కొంత సరళమయిన తరువాత ఈ తేడా ప్రస్ఫుటం అవుతుంది. ఆ తరువాత రాగో అక్కచెల్లెళ్ళు ఎక్కడుంటారు ? అప్పటికి వారిలో కొద్దిమంది వ్యక్తులకు కమ్యూనిస్టు ఆదర్శం పట్ల విశ్వాసం బలపడి వాళ్ళు ఉద్యమంతోనే ఉండిపోవచ్చు. కానీ మనం వ్యక్తుల గురించి ఈ ప్రశ్న వేసుకోవడం లేదు. ప్రజా సమూహాల గురించి వేసుకుంటున్నాం. ఒక ప్రజా సమూహంగా రాగో అక్కచెల్లెళ్ళు ఎక్కడుంటారు ?

ఒకప్పుడు కమ్యూనిస్టు ఉద్యమం, సంఘ సంస్కరణ ఉద్యమం, కాంగ్రెస్ వారి జాతీయోద్యమం బలంగా ఉండిన కోస్తా ఆంధ్ర జిల్లాలలో ఈ రోజు రౌడీయిజం, కులతత్వం, బాబా భక్తి, అశ్లీల సంస్కృతి రాజ్యం చేస్తున్నాయని విమర్శిస్తుంటాం. దీనిని ఆ ఉద్యమాల వైఫల్యంగా గుర్తిస్తున్నాం. ఇది వైఫల్యమే కానీ ఆ వైఫల్యం ఎక్కడుందో సరిగ్గా గుర్తిస్తున్నామా ? ఒకనాడు తమ గొడుగు కిందికి వచ్చిన ప్రజానీకాన్ని శాశ్వతంగా ఆ గొడుగు కింద ఉంచుకోలేకపోవడాన్ని వైఫల్యం అంటున్నామా ? ఇది వాస్తవికమైన విమర్శేనా ? అనాడు ఆ ప్రజానీకం ఏం కోరి ఆ ఉద్యమాలలోకి వచ్చారో ? ఏ మేల్కొలుపు, ఏ

వ్యక్తిత్వ వికాసం, ఏ ఆకాంక్ష వాళ్లను ఆ ఉద్యమాలలోకి తీసుకు వెళ్లిందో ? ఆ మేల్కొలుపుకూ ఆ మేల్కొలుపు కల్గించిన ఉద్యమ అంతిమ లక్ష్యాలకు ఉన్న సంబంధం ఏపాటిదో ? ఈ విషయాలు ఆలోచించలేకపోవడాన్ని వైఫల్యం అంటున్నామా ? అయితే ఆ వైఫల్యం ఈనాటికీ కొనసాగడం లేదా ? మొదట కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయింది మధ్యతరగతి శూద్ర అగ్రకుల రైతాంగం అనీ, వారికి కమ్యూనిజంతో ఉన్న అవసరం పరిమితమేననీ గుర్తించి ఆ వర్గాన్ని అధిగమించి అట్టడుగు వర్గాలలోకి కమ్యూనిస్టు పార్టీ పురోగమించలేక పోవడం కమ్యూనిస్టు ఉద్యమ వైఫల్యం అనుకుంటే ఆ అట్టడుగు వర్గాలలో కూడ కూలి రేట్లు పెరిగి కొందరికి కొంత భూమి దొరికి అంటరానితనం పోయి కొందరికి ఉద్యోగాలు దొరికిన తరువాత కనీసం ఆ వర్గంలోని అగ్రగామి విభాగం కమ్యూనిస్టులను కాదని కాంగ్రెస్ వైపు - బాబాల వైపు, సినిమాల వైపు - ఆకర్షితులు కారని నమ్మడానికి ఆధారాలున్నాయా ? కోస్తా ఆంధ్ర జిల్లాలలో అనాడు కమ్యూనిస్టు పార్టీకి అట్టడుగు వర్గాలలో పునాది ఉన్నచోట ఇదే జరగలేదా ? దీనిని కమ్యూనిస్టు ఉద్యమ వైఫల్యంగా గానీ ఆ వర్గాల స్వార్థంగా గానీ అర్థం చేసుకోవలసిన అవసరం లేదు. చరిత్ర పరిణామక్రమంలో సహజమైన విషయంగా అర్థం చేసుకోవడం సబబుగా ఉంటుంది. సామాజిక మానవ ప్రవృత్తికీ చరిత్రకూ మధ్యనున్న సంబంధాన్ని గురించి మనం లోతయిన అవగాహన పెంపొందించుకోనంత కాలం - అసలు ఆ విషయాన్ని గురించి అవగాహన అవసరం అని గుర్తించనంత కాలం - ఈ విషయం మనకు అర్థం కాదు. 'మనిషి' ని గురించి కొన్ని పడికట్టు సూత్రాలు జేబులో పెట్టుకొని ఎదురయిన ప్రతీ ప్రశ్నకూ రెడీమేడ్ జవాబులు చెప్తూ ఉంటాం.

తమకు కొన్ని కనీస హక్కులు కావాలనీ తక్షణ పీడన తొలగిపోవాలనీ కోరుకోవడం మానవ సహజమైన లక్షణం. అయితే మొత్తంగా సమాజాన్ని విముక్తం చేయకుండ తన మీద ఉన్న పీడనను కొంతయినా సరళతరం చేసుకోలేని వర్గం సమాజంలో ఏదీ లేదు. సమాజాన్ని మొత్తంగా విముక్తం చేయాలనే రాజకీయ విలువకు మట్టుకు సామాజిక చైతన్యంలో కొంత స్థానం ఉంటుంది. వ్యక్తులు ఒక్కొక్క మేరకు దీనిని విశ్వసిస్తారు. ఈ విశ్వాసాన్ని - చైతన్యవంతమైన ఆకాంక్షను - ఉద్యమాలూ పోరాటాలూ పెంచుతాయి. ఆ చైతన్యం సమాజంలో బలమైన స్థాయికి చేరుకున్నప్పుడు విముక్తి సాధ్యం అవుతుంది. ఏదో ఒక సామాజిక వర్గా

నికి ఆ చైతన్యం స్వాభావికంగా ఉంటుందనుకోవడం వట్టి భ్రమ. మానవ ప్రవృత్తి లోని పరిమితులను (అల్పత్వ మనండి, అల్పసంతోషమనండి) అధిగమించే మానవ వర్గాల 'ప్రవృత్తి' ఒకటి ఉందనుకోవడం భ్రమ. సమసమాజాన్ని భౌతిక జీవితశక్తుల పరిణతితో చారిత్రకంగా ముడిపడి ఉన్న చైతన్యవంతమైన ఆకాంక్షగా కాక భౌతిక పరిస్థితులనుండి కొన్ని వర్గాలలో అనివార్యంగా పుట్టే అసంకల్పితమయిన, ఆకాంక్షగా అర్థం చేసుకోవడం మార్క్సిజం కాలక్రమంలో మొరటు బారడానికి గల అనేక కారణాలలో ఒకటి.

కార్మికవర్గం శ్రమ దోపిడీ నుండి పూర్తి విముక్తి సాధించాలంటే మొత్తంగా సమాజాన్ని విముక్తి చేయాలని మార్క్స్ భావించాడు. కానీ మొత్తంగా శ్రమ దోపిడీనుండి విముక్తమయ్యేంత వరకు కమ్యూనిస్టు ఉద్యమాన్ని కార్మిక వర్గం అంటి పెట్టుకొని ఉండడం లేదు. దోపిడీ 'భరించ దగ్గ' స్థాయికి చేరుకున్నాక కార్మిక వర్గంలోని ఒక్కొక్క విభాగం దూరమవుతూ ఉంది. కొందరు వ్యక్తులు మట్టుకే మిగులుతున్నారు. కొంచెం కూడ భరించ దగ్గ స్థాయికి దోపిడీని సరళతరం చేయలేని దుస్థితిలో పెట్టుబడిదారీ వ్యవస్థ శాశ్వతంగా ఉండదు. సంక్షుభిత సమయాలలో మట్టుకే పుంటుంది. కార్మిక శ్రమ దోపిడీకే కాదు, ఇది అన్ని రకాల అణచివేతకూ వర్తిస్తుంది. రాగో వంటి ఆదివాసీ స్త్రీలు, రాగో తండ్రి వంటి ఆదివాసీ రైతులు, తమ జీవితాలను కొంత 'భరించ దగ్గ' స్థాయికి మెరుగుపరచు కోవడానికి మొత్తంగా సమాజాన్ని అన్ని రకాల అణచివేత నుండి విముక్తం చేయవలసిన అవసరమేమీ లేదు. 'భరించ దగ్గ' స్థాయితో అంతో ఇంతో సంతృప్తి చెందకుండ పూర్తి సమ సమాజ స్థాపన కోసం తపనపడే ప్రజాసమూహం - వ్యక్తులు వేరే సంగతి - సమాజంలో ఏదీ లేదు.

సమాజం పొరలలో క్రిందికి పోయేకొద్దీ సంపూర్ణ సమసమాజ ధ్యేయం కోసం తన భౌతిక జీవిత పరిస్థితుల వల్ల చివందాకా తప్పనిసరిగా పోరాడే ప్రజా సమూహం - వర్గంగానీ కులంగానీ మరొకటిగానీ - ఉందనే ఆలోచన విడిచిపెట్టి సమసమాజస్థాపన గురించి కొత్తగా ఆలోచించాలి. సమసమాజ ధ్యేయం మనుషులు చైతన్యవంతంగా ఎంచుకునే రాజకీయ లక్ష్యమే తప్ప అణచివేతనుండి అనివార్యంగా పుట్టే ఆకాంక్ష కాదు. అణచివేతకు గురయ్యేవారు తమకు సమానత్వం కావాలని కోరుకుంటారు. అందరికీ సమానత్వం కావాలని కోరుకుంటారన్న నమ్మకమేమీ

లేదు. తాము అసమానత ఫలితాన్ని అనుభవిస్తున్నారు కాబట్టి ఇతరుల సమానత్వ ఆకాంక్షను కొంచెం సులభంగా అర్థం చేసుకుంటారని ఆశించవచ్చు. అంతవరకు తప్పులేదు. కానీ దానిలో అనివార్యత ఏమీ లేదు. 'బానిస సంకెళ్ళు తప్ప' వేరే ఏమీ లేనివాళ్ళు తమకు ఈ సంకెళ్ళ నుండి విముక్తి కావాలని కోరుకుంటారు గానీ అందరికీ అన్ని సంకెళ్ళ నుండి విముక్తి కావాలని కోరుకుంటారన్న నమ్మకం లేదు. అది చైతన్యవంతంగా ఎంచుకునే రాజకీయ విలువే తప్ప ఒకరి 'వర్గస్వభావం కాదు. పేద మగవాళ్ళు కూడ భార్యలను హింసిస్తారనీ, కార్మికులు కూడ హిందూ' ముస్లిం ఘర్షణలలో పాల్గొంటారనీ, ఆదివాసీలు కూడ మాల మాదిగలను అంటరాని వారిగా చూస్తారనీ, దళితులు కూడ బాబ్రీ మసీదు విధ్వంసానికి అయోధ్య వెళ్ళారనీ తెలిసినప్పుడు మనం ఆశ్చర్యపోనవసరం లేదు.

ఒకవేళ అణచివేతకు గురయ్యే ప్రజలలో అన్ని రకాల అణచివేత పట్ల వ్యతిరేకత సహజంగానే పుడుతుందని నమ్మినా-అటువంటి ఒక ప్రజా సమూహాన్ని సమాజంలో వెతికి గుర్తించగలిగినా - అదే సమ సమాజ లక్ష్యానికి దారితీస్తుందన్న నమ్మకం లేదు. దానికిది తార్కిక ఫలితం కాదు. సమ సమాజం అంటే అణచివేత లేని సమాజం మట్టుకే కాదు. సమష్టి సహజీవనం ప్రాతిపదిక మీద నడిచే సమాజం. అణచివేత పట్ల సంపూర్ణమైన వ్యతిరేకత ఏదో ఒక వర్గానికి తన భౌతిక జీవిత పరిస్థితుల కారణంగా అనివార్యంగా కలుగుతుందనుకున్నా, సమష్టి సహ జీవనం అనే విలువ అటువంటిది కాదు. అది ప్రయత్న పూర్వకంగా ఏర్పరచుకునే రాజకీయ విలువ. దానికి పీడిత ప్రజలు పీడకులపైన పోరాటాలు చేస్తే సరిపోదు. ప్రతి ఒక్క వ్యక్తీ తన మీద తాను చాలా పోరాటం చేయవలసి ఉంటుంది. ఇప్పటివరకు అటువంటిదొకటి ఉందని కూడ మార్క్సిస్టులు ఒప్పుకొని 'మానవ ప్రవృత్తి' పైన చాలా పోరాటం చేయవలసి ఉంటుంది.

కార్మికులు సమసమాజాన్ని స్వాభావికంగానే కోరుకుంటారని మార్క్స్ నిజంగా నమ్మాడా అన్న ప్రశ్న వేయవచ్చు. 'పేదవాళ్ళంతా మంచి వాళ్ళు - డబ్బున్నవాళ్ళే దుర్మార్గులు' అనే సెంటిమెంటల్ భావన ఆ రోజులలో యూరప్ లోని సామ్యవాదులలో బలంగా ఉండేది. మార్క్స్‌కు ఈ రకమయిన సెంటిమెంట్లంటే చాలా అసహ్యం. ప్రోధన్ వంటి వాళ్ళను ఈ కారణంగానే గట్టిగా దుయ్యబట్టాడు. అయితే శ్రమదోపిడీ నుండి సంపూర్ణంగా కార్మికులు విముక్తి

పొందాలంటే సోషలిజం తప్ప గత్యంతరం లేదు కాబట్టి తమ భౌతిక పరిస్థితులవల్ల వాళ్ళు అనివార్యంగా సోషలిస్టు ఆకాంక్ష వైపు ఆకర్షితులవుతారని నమ్మాడు. ఆ సెంటిమెంట్ ఏ మాత్రం సత్యమో ఈ అనివార్యత కూడ ఆ మాత్రమే సత్యమని కార్మికోద్యమ కార్య రంగంలో ఉన్న కమ్యూనిస్టులకు త్వరలోనే అర్థం అయింది. సిద్ధాంతానికీ ఆచరణకూ చాలా ఇబ్బందికరంగా తయారయింది. ఈ ఇబ్బందిని అధిగమించడానికి 'కార్మిక వర్గం అంటే కమ్యూనిస్టు పార్టీయే' ననే దృక్పథం పుట్టింది. ఈ సూత్రీకరణ మొదట చేసింది ఎవరో కానీ లెనిన్ కాలం నుండి ఈ వైఖరి మార్క్సిస్టులలో ప్రబలం అయింది. సమసమాజ స్థాపన కార్మిక వర్గం ఆకాంక్ష అయినా కాకున్నా కమ్యూనిస్టు పార్టీ చివరిదాకా దానికోసం పోరాడుతుందన్నారు. ఇది సమాజంపైన కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వానికి దారి తీస్తుందనేది ఈ శతాబ్దపు చరిత్ర నేర్పిన పాఠం.

ఆనాడే లెనిన్ వైఖరితో విభేదించిన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో రోజా లగ్జెంబర్గ్‌ను, అంటోనియో గ్రామ్‌సీని చెప్పుకోవాలి లగ్జెంబర్గ్ లెనిన్‌తో బహిరంగంగానే విభేదించి సోషలిజాన్ని సాధించేది కార్మికవర్గమే తప్ప కమ్యూనిస్టు పార్టీ కాదనింది. మరి కార్మిక వర్గంలో సిద్ధాంతం ప్రకారం ఉండవలసిన ఆకాంక్ష లేనప్పుడు ఏం చేయాలో ఆమె సిద్ధాంతీకరించ లేదు. అంతలో చనిపోయింది. గ్రామ్‌సీ బహిరంగంగా విభేదించ లేదుగానీ కార్మిక వర్గం - ఒక వర్గంగా ఇటలీ సమాజంపైన తన ఆధిపత్యాన్ని నెలకొల్పి రాజ్యాధికారాన్ని ఏ విధంగా సాధించాలనే ప్రశ్న ఆయన విశేషంగా చేసిన సామాజిక రాజకీయ తాత్విక విశ్లేషణకు ప్రేరకం. ఆయన జైలులోనే చనిపోకుండ బ్రతికి ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా కొనసాగి వుంటే, కార్మిక వర్గానికి ఉందో లేదో తెలియని ఆకాంక్షను ఆపాదించి ఆలోచించడంలో ఉన్న ఇబ్బందిని ఏ విధంగా అధిగమించేవాడో తెలీదు.

సమసమాజాన్ని సమాజంలో మెజారిటీ ప్రజలు తమ జీవిత ఆకాంక్షగా కోరుకున్న నాడే దాని స్థాపన ప్రజాస్వామికంగా జరుగుతుంది. అన్ని రకాల అణచివేతనూ తన గొడుగు కిందికి తీసుకొని తన నమూనాలో సకల సామాజిక సంబంధాలనూ తిరగరాస్తున్న 'పెట్టుబడి' ఆధిపత్యంలో 'భరించదగ్గ' జీవితం కూడ అసహ్యంగా ఉందని సమాజంలో మెజారిటీ ప్రజలు చైతన్యవంతంగా నిర్ణయించుకున్న నాడు ప్రత్యామ్నాయ సమాజ రూపకల్పన సాధ్యం అవుతుంది. బహుశా

ఆ విధంగానే జరగబోతుంది. అంతవరకు సోషలిజం నిర్మిస్తామంటూ ఏర్పడే ఏ ప్రభుత్వమైనా ఏదో ఒక పునాది ప్రజా సమూహం పేరు మీద ఏదో ఒక పార్టీ చలాయించే నియంతృత్వమే. పెట్టుబడిదారీ దోపిడీకి గానీ ఇతర రూపాల అణచివేతకు గానీ గురయ్యే ప్రజలను సమీకరించడానికి జరిగే పోరాటాలన్నీ కూడ సమసమాజ విలువలను సమాజం ముందు నిలబెడతాయి. తక్షణ పోరాట అవసరం నుండి వాటిని 'జనరలైజ్' చేసి మానవ ఆకాంక్షగా సామాజిక చైతన్యంలో వాటిని భాగం చేస్తాయి. ఈ పోరాటాలలోకి వచ్చే ప్రజలలో కొద్దిమందో ఎక్కువ మందో పోరాట ఫలం కొంత దక్కగానే సమ సమాజ ఆదర్శానికి దూరం కావచ్చు. కానీ సామాజిక చైతన్యంలో ఆ పోరాటం తీసుకొచ్చిన మార్పు దాని అసలు విజయం. ఈ విజయాల పరంపర ఒక దశను చేరుకున్న తరువాత సమసమాజ నిర్మాణం సాధ్యం అవుతుంది. ధనికుల కంటె పేదవాళ్ళలో, అగ్రకులాల కంటె దళితులలో, పురుషుల కంటె స్త్రీలలో ఈ చైతన్యాన్ని సాధించడం కొంత సులభం కావచ్చునని నమ్మడం అసంబద్ధం కాదు. కానీ దీనిలో అనివార్యత ఏమీ లేదు. చివరికి మనుషులు సమసమాజాన్ని కాంక్షించబోయేది కార్మికులుగా, ఆదివాసీలుగా, స్త్రీలుగా, దళితులుగా కాదు. చైతన్యవంతులయిన వ్యక్తులుగా.

ఈ పరిణామం సులభతరం కాదు. అందరూ శ్రమ చేసి అందరూ సమానంగా సమిష్టిగా తమ జీవితాన్ని నియంత్రించుకునే సమసమాజ స్థాపన జరగాలంటే అన్ని రకాల అసమానతలను అణచివేతను, ఈనాడు వాటికన్నిటికీ ఆలంబనమయిన పెట్టుబడిఅనే వికారమయిన సామాజిక సంబంధాన్ని ద్వేషిస్తే చాలదు మానవ ప్రవృత్తిలోని అల్పత్వాన్ని కూడ ద్వేషించడం నేర్చుకోవాలి. అది ఉన్నన్నాళ్లు సమష్టి సహజీవనం సాధ్యం కాదు. మనలోని అల్పత్వం తరతరాల అణచివేత వల్ల పుట్టిందని మన సంతృప్తి కోసం మనం చెప్పుకుంటామో, లేకపోతే ఆ వికార లక్షణాలు మానవ ప్రవృత్తిలో ఉండబట్టే ఇన్ని శతాబ్దాల అణచివేత సాధ్యమయిందేమోనన్న ఆలోచనను కనీసం ఒక ప్రశ్నగా, ఒక సందేహంగా, ముందుకు రానిస్తామో - ఏదయినా మన లోని వికార ప్రవృత్తిని మానవులంతా ద్వేషించడం నేర్చుకునేదాకా సమష్టి జీవితం సాధ్యం కాదు. సమష్టి జీవితం సాధ్యం కావాలంటే ఆర్థిక దోపిడీ, కుల పెత్తనం, పురుషాధిక్యత, జాత్యహంకారం మొదలయినవి నశిస్తే చాలదు అవి నశించవలసిందే, కాని అవి నశిస్తే చాలదు. మనిషిలో - సామాజిక చైతన్యంలో సహజీవన తత్వం

పెరగాలి. 'సోషలిస్టు పునాది' అనేదేదో ఒకటి ఉందనీ దాన్ని నెలకొల్పితే సోషలిస్టు చైతన్యం అదే పుట్టుకొస్తుందనీ నమ్మడం పట్టి భ్రమ. 70 ఏళ్ళకు పైగా ఈ భ్రమతో మార్క్సిస్టులు తమను తాము వంచించుకున్నారు, ప్రపంచాన్ని వంచించారు. ఈ వంచన ఈనాడు ఆర్మేనియాలో, అజర్బైజాన్‌లో, బోస్నియాలో బయట పడుతూ ఉంది. రేపు చైనాలో బయటపడుతుంది.

సోషలిజం కోసం జరిగే పోరాటాలలో భాగంగా మనుషులలో అణచివేత పట్ల వ్యతిరేకతతో పాటు సమష్టి తత్వం, సహజీవన సంస్కృతి పెరగాలి. ఇవి రెండూ ఒకటి కాదు. మొదటిది సాధిస్తే రెండవది దానంతటది సిద్ధించదు. రెండవది సాధ్యం కావాలంటే మానవ ప్రవృత్తిలోని అనేక వికారమయిన లక్షణాలను ద్వేషించడం నేర్చుకోవాలి. చరిత్ర క్రమానికి ఈ లక్షణాలు ఆటంకం కాగల వైనాన్ని, చరిత్ర క్రమంలో వాటిలో మార్పు రాగల వైనాన్ని కూడ గుర్తించాలి. దీనికి సంబంధించిన తాత్విక అవగాహన కావాలి.

చారిత్రక భౌతిక వాదంలోని ఈ ఖాళీని పూరించడానికి కాల్పనిక సాహిత్యం చాలా దోహదం చేయగలదు. మనిషిని భౌతిక శక్తుల సృష్టిగాను, ప్రయోగశాలలో వస్తువు గాను కాక చరిత్రలో నివసించే చైతన్యమూర్తిగా దర్శించగల సామర్థ్యం కాల్పనిక సాహిత్యానికి ఉంది. ఈ కర్తవ్యాన్ని అందుకోగల సాహిత్యం నేడు అవసరం. 'ఈ అభ్యుదయవాదులు పట్టి మూర్ఖులు. వాళ్ళు మనుషులంతా తమ వంటి వారే ననుకుంటారు' అని దాస్టయెవ్‌స్కీ తన రాజకీయ నవల 'బ్రదర్స్ కారమజోవ్'లో అంటాడు. అంటే మనిషిలో అసాంఘిక, వికారమైన లక్షణాలే ప్రధానమనీ వాటివల్ల సోషలిజం అనేది సాధ్యం కాదనీ ఆయన భావం (అభ్యుదయవాదులు మట్టుకు ఇందుకు మినహాయింపని ఎందుకు భావించాడో తెలియదు !). మానవ ప్రవృత్తికి సంబంధించిన చారిత్రక విశ్లేషణ అక్కడితో ఆగిపోకుండ అర్థవంతంగా ముందుకు పోవలసి ఉంది. దానికి మార్క్సిస్టు సాహిత్యకారులు కాకపోతే ఎవరు పూనుకోవాలి ?

26-8-1993

— కె. బాలగోపాల్

★